

గ్రంథాలయాన్ని అందరికి అందుబాటులో ఉంచాలి

మంథని, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయాన్ని అందరికి అందుబాటులో ఉండే విధంగా మార్చాలని ప్రజాసంఘాల నేతలు బూడిద గణేష్, గొర్రెంకల సురేష్, బాపు రవి, విరుగురాల ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు గ్రంథాలయాన్ని సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అందరి అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఉన్న భవనంలోకి మార్చాల న్నారు. విజ్ఞాన కేంద్రంగా మారాలంటే తొలుత వాటి సమస్యలు తీర్చి, ముఖ చిత్రాన్ని మార్చాలన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేసి, సమస్యలు తీర్చాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గ్రామైక్య సంఘాలకు శిక్షణ

ఓదెల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో శుక్రవారం ఇటీవల నూతనంగా ఎన్నికైన గ్రామైక్య సంఘాలకు సీఆర్‌పీలు ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. గ్రామ సంఘాలను ఎలా బలోపేతం చేయాలో, అలాగే కార్యక్రమాలను, సేవలను ఏ విధంగా నిర్వహించాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం లత మంగేశ్వరి, సీఆర్‌పీలు కృష్ణవేణి, ఉపేం ద్ర, మండల సమైక్య అధ్యక్షురాలు ఆలేటి స్వప్న, సీసీలు మారెళ్ల శ్రీనివాస్, పాలితం మల్లయ్య, కొమురయ్య, విజయ, రాజకుమారి, అకౌంటెంట్ భవాని, పవన్ కుమార్, మహిళలు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగేదెన్నడో?


శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోపల అక్రమంగా నిర్మించిన చేపల చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారులు

- ఎల్లంపల్లి ప్రాజెక్టులో 70 ఎకరాల భూమి కబ్జాకు గురైనట్లు గుర్తించిన అధికారులు
- యథేచ్ఛగా కొనసాగుతున్న చేపల పెంపకం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు లోపల 70 ఎకరాల భూములు కబ్జాకు గురైనట్లు అధికారులు గుర్తించినా కూడా ఆక్రమణలకు తొలగించడంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఆక్రమణలకు తొలగించాలని ఇరవైరోజుల క్రితమే జిల్లా ఉన్నతాధి కారులు ఆదేశించినా కూడా కిందిస్థాయి అధికారులు తొలగించడంలేదు. చేపల పెంపకం మాత్రం యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఎప్పటికప్పుడు చేపలు పడుతూ మార్కెట్‌కు తరలిస్తున్నారు. గత ఏడాది డిసెంబరు 20వ తేదీన ఆంధ్రజ్యోతి జిల్లా ఎడిషన్‌లో 'ఎల్లంపల్లిలో భూములు కబ్జా' 200 ఎకరాల్లో చేపల చెరువుల ఏర్పాటు అనే శీర్షికన అక్రమార్కుల అక్రమ బాగోతాన్ని వెలుగులోకి తీసుకువచ్చింది. దీనిపై స్పందించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష రెవెన్యూ, నీటిపారుదల, సర్వే అండ్ ల్యాండ్ అధికా రులతో జాయింట్ సర్వేకు ఆదేశిం చారు. దీంతో నీటిపారుదల శాఖాధి కారులు దాదాపు పదిరోజుల పాటు సర్వే చేశారు.

● ఆక్రమణలు గుర్తించిన అధికారులు..

ప్రాజెక్టు బ్యాక్ వాటర్ పరిధిలోని పొట్యాల, అకెనపల్లి, ముర్మూర్ పరి ధిలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ వెలు పల రైతులకు చెందిన భూములను లీజుకు తీసు కుని ప్రాజెక్టు బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లోకి అక్రమంగా చొచ్చుకుని లోపలికి వెళ్లి అక్రమంగా చేపల చెరువులను నిర్మించినట్లుగా గుర్తిం చారు. అక్రమంగా విద్యుత్ ను వాడు కోవడంతో పాటు ఎఫ్‌టీఎల్‌కు అడ్డుగా కట్ట లు వేసి, ప్రాజెక్టులోకి పైపులైన్లు వేసి నీటిని అక్ర మంగా తోడుతున్నట్లు గుర్తిం చారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు భూములను ఆక్రమించారని అంతర్గాం పోలీస్ స్టేషన్‌లో కేసుల నమోదుకు ఫిర్యాదు కూడా చేశారు. కానీ ఇది తమ పని కాదంటే తమది కాదని ఒకరిపై ఒకరు నెపం నెట్టేసుకున్నారు. ఈ వ్యవహారంపై కొన్ని రోజులుగా చేష్టలుడిగి చూస్తున్న అధికార యం త్రాంగం తీరుపై విమర్శలు వెల్లువెత్తడంతో ఆరు నెలల తర్వాత అధికారుల్లో చలనం వచ్చింది. ఈ నెల 4వ తేదీన అదనపు కలెక్టర్ డి వేణు, అంతర్గాం తహసీల్దార్ తూము రవీందర్, నీటిపారుదల శాఖాధి కారులు శ్రీపాద ఎల్లంపల్లిని సందర్శించి..

మిగతా 8లో..


శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో అక్రమంగా నిర్మించిన చేపల చెరువులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ డి వేణు (ఫైల్)

డివిజన్ల పునర్విభజనతో.. మొదలైన ఎన్నికల సందడి

- రామగుండంలో ఆశావాహులు, మాజీ కార్పొరేటర్ల హడావుడి
- కాలనీల్లో యువకులను,పెద్దలను ప్రసన్నం చేసుకునే యత్నాలు



కోల్‌సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో డివిజన్ల పునర్విభ జన ప్రక్రియ మొదలు కావడంతో ఎన్నికల సందడి మొదలైంది. డివిజన్ల సంఖ్య 50 నుంచి 60కి పెరగడం, డివిజన్ల హద్దులు దాదాపుగా ఖరారు కావడంతో మాజీ కార్పొ రేటర్లు, ఆశావాహులు ఎవరికి వారుగా హడావుడి మొదలు పెట్టారు. ప్రధాన పార్టీలై న కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులతో పాటు పలువురు స్వతంత్రులుగా పోటీ చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఆయా డివిజన్లు రిజర్వేషన్లను అంచనా చేసుకుని తమకు అనుకూలంగా ఉం టుందని ప్రచారాలు చేసుకుంటున్నారు. కాలనీల్లో యువకులను, పెద్దమనుషులను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. ఆషాఢమాసం మొదలు కావడంతో ఎక్కడికక్కడ దావత్‌లు పెడుతున్నారు. మాజీ కార్పొరేటర్లు అభివృద్ధి పనులు జరుగుతున్న ప్రాంతాల్లోకి వెళ్లి హడావుడి చేస్తున్నారు. మాజీ కార్పొరేటర్లకు, ఆశావాహులకు మధ్య పలు డివిజన్లలో గొడవలు జరుగుతున్నాయి. పనులపైకి వచ్చేందుకు మీరెవరంటూ కొందరు ఆశావాహులు గొడవలు పడుతున్నారు. ఒకే పార్టీలో ఇద్దరు ముగ్గురు ఆశావాహులు ఉన్నచోట మరింత పోటీ నెలకొన్నది. సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పించుకుంటున్నారు. కార్పొరేషన్ పరిధిలోని తిలక్‌నగర్, విఠల్‌నగర్ ఏరియాల్లో సోషల్ మీడియా ప్రచారాలు శ్రుతి మించుతున్నాయి. ఇటీవల ఒక డివిజన్‌లో ఇద్దరు ఆశావాహులు పోటీతో పోస్టు చేసిన వీడియో అధికార పార్టీలో చర్చనీయాంశమయ్యింది. కొందరు ఆశావాహులు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, గృహలక్ష్మి తదితర పథకాలకు సంబంధించి పనులు చేసి పెడతామంటూ లబ్ధిదారుల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. మద్దతు కావాలంటూ ఇప్పటికే పలుకాలనీల్లో ఇళ్ల వద్దకు వెళ్లి ఆశావాహులు ముచ్చట్లు పెడుతున్నారు. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో తెలియని పరిస్థితి ఉన్నా ఆశావాహులు మాత్రం హడావుడి మొదలు పెట్టారు. ఖర్చుల విషయంలో వెనక్కి తగ్గేది లేదంటూ ప్రచారాలు చేసుకుంటున్నారు. మున్సిపల్ ఎన్నికలు ఇప్పట్లో జరిగే పరిస్థితి కూడా కనబడడం లేదు. గ్రామపంచాయతీ ఎన్నికల తరువాత మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్రప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రామగుండంలో మాత్రం ఇప్పుడే ఎన్నికలు అన్న చందంగా పరిస్థితులు మారిపోయాయి.

బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా జి వెంకటేష్



సుల్తానాబాద్, జూన్ 27: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణ బీజేపీ శాఖ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ నాయకుడు, న్యాయవాది గుడ్ల వెంకటేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతు తనను మూడోసారి పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామక్రిష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అశోక్‌రావు, జిల్లా కార్యదర్శి సౌదరి మహేందర్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తానన్నారు.

ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి


నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న కార్పొరేషన్ కార్మికులు

కోల్‌సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): వర్షాకాల సీజన్‌లో ఇంటి పరిసరాల్లో, ఇళ్లలో నీరు నిల్వకుండా ప్రజలు జాగ్రత్త పడాలని డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి సూచించారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలో వంద రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. గోదావరిఖని టీచర్స్ కాలనీ పరిసర ప్రాంతాల్లో డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి ఆధ్వర్యంలో స్వశక్తి సిబ్బంది, పారిశుధ్య సిబ్బందిచే అవగాహన కల్పించారు. ఇళ్లలో కూలర్లు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, సీసాలు, ఇతర ప్లాస్టిక్ వస్తువుల్లో నీరు నిల్వ ఉండడం వల్ల దోమల లార్వా అభివృద్ధి చెంది దోమలు వ్యాపిస్తాయని, ప్రజలు వర్షాకాల సీజన్‌లో నీరు నిల్వకుండా జాగ్రత్త పడాలన్నారు. టీచర్స్ కాలనీకి చెందిన చిల్డ్రన్ పార్కును శుభ్రం చేశారు. స్వశక్తి సంఘాల సభ్యులు పరిసరాల పరిశుభ్రతపై ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఈ షాబాజ్, ఏఈ తేజస్విని, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, కిరణ్, మెప్మా సీఓ శ్వేత, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్ పాల్గొన్నారు.

పంటలు ఎండకుండా సాగునీరు అందించాం

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వేసవిలో పంటలు ఎండిపోకుండా ప్రతీ ఎకరాకు సాగునీరు అందించామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని జాఫర్‌ఖాన్‌పేట, ఎదులాపూర్, పెద్దరాతుపల్లి, వెన్నంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోసి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. జాఫర్‌ఖాన్‌పేటలో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని, పెద్దరాతుపల్లిలో నిర్మించిన పల్లె దవాఖాన భవనంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కొత్తరేషన్ కార్డులు, హమాలీలకు లైసెన్సులు, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు కోటి రూపాయల ఖర్చుతో డీ-83 ఎస్సారెస్పీ 22ఆర్ పెద్దపల్లి దగ్గర నుంచి కాలువను ఇదిలాపూర్ వరకు శుభ్రం చేయించామన్నారు.


పెద్దరాతుపల్లిలో పల్లెదవాఖానను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చివరి కాలువలకు సాగునీరు అందించి చెరువులు, కుంటల్లో నీటిని కూడా నింపి రైతుల పంటలు కాపాడామని వివరించారు.

నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఐదు లక్షల నిధులతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. పది సంవత్సరాలుగా రేషన్‌కార్డులు లేక అనేక మంది ఇబ్బందులు పడ్డారని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్‌కార్డులు అందజేస్తున్నామన్నారు. కూనారం వ్యవసాయ పరిశోధన కేంద్రం అభివృద్ధికి తనవంతుగా కృషిచేస్తామని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తాను ప్రకటించే అభ్యర్థులను గెలిపించుకోవాలని గ్రామస్థులకు సూచించారు.

కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ చదువు రామచంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గజనవేన సదయ్య, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, ఎంపీడీవో పూర్ణచందర్‌రావు, డాక్టర్ శ్రీనివాస్, డీఎంవో ప్రవీణ్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ వసంత తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం ఇవ్వండి

కమాన్‌పూర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి) కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాండ్ల మోహన్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీనుబాబుకు, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అస్మతుల్లా ఖాన్, జిల్లా పరిశీలకులు సంగీతం శ్రీనివాస్‌కు శుక్రవారం దరఖాస్తు చేశారు. సెంటినరీ కాలనిలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బీఆర్‌ఎస్ నాయకులు ఎంతో ఇబ్బందులకు గురిచేసినా పార్టీలో ఉండి మంత్రి శ్రీదర్‌బాబు ఆదేశాలమేరకు పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేశానన్నారు. తనను గుర్తించి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశమివ్వాలని దరఖాస్తులో పేర్కొన్నారు.

వైద్య శిబిరం

ఓదెల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనూర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 105 మందికి వివిధ రకాల రక్తపరీక్షలు నిర్వహించి, నమూనాలను సేకరించారు. అలాగే శనివారం కనగర్తిలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సంజనేష్ కుమార్, పెద్దపల్లి ఐసిటిసి కౌన్సిలర్ స్వప్న, టెక్నీషియన్ శ్రీనివాస్, శోభారాణి, అశోక్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి బోనాలను విజయవంతం చేయండి

కళ్యాణ్‌నగర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం సందర్భంగా జూలై 5న ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే బోనాలు, పట్నాలకు పెద్దఎత్తున ముదిరాజ్ కులస్థులు తరలిరావాలని ముదిరాజ్ సంఘం నాయకుడు సబ్బు మల్లయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది జీఎం కాలనీ సమీపంలో ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద బోనాలను నిర్వహిస్తామన్నారు. జూలై 5న సా యంత్రం గోదావరిఖని ప్రధాన చౌరస్తాకు బోనాలతో తరలిరావాలన్నారు. సమావేశంలో ముదిరాజ్ సంఘం నాయకులు అప్పరాజు ప్రభాకర్, గైక్వాడ్ రజనీకాంత్, రావుల స్వరాజ్, శీలం శ్రీనివాస్, దబ్బెట శంకర్, రాజయ్య, సాంబయ్య, ఇస్తారి, రాజయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి: కలెక్టర్

పెద్దపల్లిటౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆసుపత్రికి వచ్చే రోగులకు తగినసేవలు అందించాలని, ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. జిల్లా ఆసుపత్రి పనితీరుపై సంబంధిత అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రికి ప్రజాప్రతినిధులు, ప్రజల్లో మంచిపేరు వచ్చిందని, విశ్వాసం నిలబెట్టుకునేలా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. టిఫా స్కానింగ్ సౌకర్యం ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉందని గర్భిణులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని, గర్భిణులను మొదటి నుంచీ సాధారణ ప్రసవాల వైపు ప్రోత్సహించాలన్నారు. పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం విద్యార్థుల ఆరోగ్యం నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో డీసీహెచ్‌వో డాక్టర్ శ్రీధర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్నప్రసన్న కుమారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సీఆర్‌పీ విధులను పకడ్బందీగా నిర్వహించాలి

పెద్దపల్లి కల్చరల్: క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్‌పీ) విధులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత విద్యాశాఖ అధికారులు, సీఆర్‌పీలతో విద్యాశాఖ వర్క్ అడ్జెస్ట్‌మెంట్, పాఠశాలల నిర్వహణపై శుక్రవారం సమీక్షించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలన్నారు. వారానికి ఒకరోజు విద్యార్థులతో కలిసి భోజనం చేసి, భోజన నాణ్యతను పరిశీలించాలని సూచించారు. మండల కేంద్రాల్లోని భవిత కేంద్రాలను సైతం సీఆర్‌పీలు తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జీసీడీవో కవిత, ఎస్‌వో మల్లేష్, పీఎం షేక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

ఎంఈవో కార్యాలయం తనిఖీ

పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి మండల విద్యాధికారి కార్యాలయాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా కార్యాలయ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థుల సంఖ్య కు అనుగుణంగా ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలని, ఉన్నత పాఠశాలలో అన్ని సబ్జెక్టుల టీచర్లు అందుబాటులో ఉండాలన్నారు. వెంట పలువురు అధికారులు పాల్గొన్నారు.

● ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ పూర్తిచేయాలి

పెద్దపల్లి (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం ఆయన సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్, వన మహోత్సవం, ఉపాధి హామీ పనులపై ఎంపీడీవోలు, ఎంపీవోలు, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్‌లో జిల్లా చాలా వెనుకబడి ఉందని అన్నారు. జిల్లాలో మంజూరు చేసిన 4,000 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చూడాలని అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జూలై 10లోపు గుంతలు తవ్వకం పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలను పీఏఐ (పంచాయతీ అడ్వా న్స్మెంట్ ఇండెక్స్)లో అచీవర్స్‌గా నిలపాలని, కేంద్ర ప్రభు త్వం నిర్దేశించిన ప్రతి అంశంలో కనీసం 100 శాతం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో అమలు అయ్యేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

● 500 ఇళ్లలో పీఎం సూర్య ఘర్ యోజన..

ప్రతి మండలంలో 500 ఇళ్లలో పీఎం సూర్య ఘర్ యోజనను అమలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. ఇళ్లపై సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్యానెల్స్ ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం 40 శాతం సబ్సిడీ అందిస్తుందని అన్నారు. సమావేశాల్లో డీఆర్‌డీవో ఎం కాళిందిని, డీపీవో వీరబుచ్చయ్య, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

ఓదెల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నేటి పరిస్థితుల్లో ఇష్టంతో చదివితేనే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని కాళోజీ సాహిత్య పురస్కార అవార్డు గ్రహీత, బహుభాష కోవిదుడు నలిమెల భాస్కర్ అన్నారు. మండలంలోని కొలనూర్ హైస్కూల్‌లో శుక్రవారం పూర్వ విద్యార్థి అయిన బాసిక్స్ కంపెనీ సీఈవో దేవరకొండ సత్తయ్య కంపెనీ యాజమాన్యాన్ని ఒప్పించి ఐదులక్షల రూపాయల విలువగల ఆర్వో ప్లాంట్, ఫర్నిచర్, ర్యాక్స్ ఫ్రిడ్జిని సమకూర్చిన సందర్భంగా పూర్వ విద్యార్థులతో సన్మాన సభను నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన కాళోజి సాహిత్య అవార్డు గ్రహీత, బహుభాషా కోవిదుడు నలిమెల భాస్కర్ హాజరై మాట్లాడారు. ఇదే హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా కొనసాగుతూనే 14 భాషలపై పట్టు సాధించానన్నారు. 1984-85 సంవత్సరంలో ఇదే పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈవో రమేష్, హెచ్‌ఎం ఏసుదాసు, ప్రొఫెసర్ నతానియల్, జీగురు ఐలయ్య, బసిక్స్ కంపెనీ సీఈవో దేవరకొండ సత్తయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నలిమెల భాస్కర్

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి: ఏవో

పెద్దపల్లి రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు పంటల సాగులో రసాయనిక ఎరువులు తగ్గించాలని మండల వ్యవసాయాధికారిణి అలివేణి అన్నారు. శుక్రవారం మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏవో అలివేణి మాట్లాడారు. రెండు కిలోల పీఎస్‌బీని 10 నుంచి 20 కిలోల సేంద్రియ ఎరువు లేదా పాడి పశువుల పేడలో కలుపుకొని ఒక ఒకరం భూమిలో సమానంగా చల్లుకుంటే రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. అజోస్పైరిలం బ్యాక్టీరియా పొడిని రెండు కిలోలని 20 కిలోల పశువుల పేడ లేదా సేంద్రియ ఎరువుల్లో లేదా వర్మీ కంపోస్టుల్లో కలుపుకోని ఒక ఎకర పొలానికి చల్లుకున్నట్లయితే యూరియా వాడకాన్ని దాదాపుగా సగానికి తగ్గించుకోవచ్చన్నారు. లాభదాయక సాగు యజమన్యా పద్ధతులపై ప్రయోగాత్మక ప్రదర్శన రైతు వేదికల్లో త్వరలో చేపట్టడం జరుగుతుందని వ్యవసాయాధికారి అలివేణి తెలిపారు.

విత్తనాల దుకాణంలో తనిఖీలు

జ్యోతినగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ మేడిపల్లి రోడ్డులోని ఒక విత్తనాల దుకాణంలో రామగుండం వ్యవసాయ అధికారి(ఏవో) ప్రకాష్ శుక్రవారం తనిఖీలు చేశారు. దుకాణంలో విక్రయిస్తున్న వివిధ రకాల విత్తనాల శ్యాంపిళ్లను సేకరించి పరీక్షల కోసం పంపించారు. అలాగే రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విత్తన విక్రయ షాపులో తనిఖీలు చేపట్టామని, నకిలీవిత్తనాలు అమ్మితే కేసు నమోదు చేస్తామని ఏవో హెచ్చరించారు.


రికార్డులు తనిఖీ చేస్తున్న ఏవో ప్రకాష్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి


శ్యాం, చక్రి (ఫైల్)

పెద్దపల్లి రూరల్/కోల్‌సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిజిల్లా పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట గ్రామ శివారులో గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖని పట్టణానికి చెందిన చిలుకల చక్రి (25), శ్యామ్ (24) అనే ఇద్దరు యువకులు పెద్దపల్లి నుంచి గోదావరిఖనికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈక్రమంలో అప్పన్నపేట శివారులో గురువారం రాత్రి సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడం ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. చిలుకల చక్రి సింగరేణి బీ గెస్ట్‌హౌస్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. చక్రి రెండున్నర సంవత్సరాల క్రితం కొత్తగూడెంనకు చెందిన ఒక యువతిని ప్రేమించి పెళ్లి చేసుకోగా 15నెలల కుమారుడు ఉన్నాడు. శ్యాం డిగ్రీపూర్తి చేసి ఇంటివద్దనే ఉంటున్నాడు. ఇద్దరు స్నేహితులు రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో విషాదచాయలు అలముకున్నాయి. మృతుడు శ్యాం తండ్రి సోగాల రవీందర్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరి మృతి

● మరొకరికి గాయాలు

జగిత్యాల రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలం తాటిపల్లి వద్ద గురువారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో జగిత్యాల పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన కట్ట ఆదిత్య(19) అనేయువకుడు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందినట్లు జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ జగిత్యాలరూరల్ మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన పూదరి శ్రీనివాస్‌కు తీవ్రగాయాలుకాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఆదిత్య తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడి ఒకరి మృతి

కమాన్‌పూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన గుండేటి స్వామి(42) అనేవ్యక్తి ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ కాలువలో పడి శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపినవివరాల ప్రకారం.. స్వామి శుక్రవారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై పత్తి చేనుకు వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ కాలువలో పడిపోయాడు. చుట్టుపక్కల రైతులు గమనించి వచ్చేసరికి స్వామి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్వామిభార్య విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొట్టె ప్రసాద్ తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

ధర్మపురి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కొద్దిరోజుల క్రితం ఆత్మహత్యాయత్నం చేసిన ధర్మపురి మండలంలోని దొనూర్ గ్రామానికి చెందిన జంగం మల్లేష్(42)అనేవ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. మల్లేష్ మూడు సంవత్సరాల్లో మూడుసార్లు సర్జరీ చేయించుకోగా రోగం నయం కాలేదని ఆయన పేర్కొన్నారు. ఈనెల 17న మల్లేష్ గడ్డిమందు తాగగా చికిత్సపొందుతూ హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో గురువారం మృతిచెందాడు. మల్లేష్ భార్య గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్య కారణంతో ఎస్సారెస్పీ ఉద్యోగి ఆత్మహత్య


ధర్మయ్య(ఫైల్)

జగిత్యాల క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల డివిజన్‌లో నీటి పారుదలశాఖలో లష్కర్‌గా విధులునిర్వహిస్తున్నకండ్లపెల్లి ధర్మయ్య(61) అనారోగ్యకారణాలతో శుక్రవారం తెల్లవారుజామున ఉరివేసు కుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈనెల 30న ధర్మయ్య పదవీవిరమణ ఉండడం ఇంతలోనే ఆత్మహత్యకు పాల్పడడండతో ఆ కుటుంబంలో తీవ్రవిషాదాన్ని నింపింది. మృతుడికిభార్య లక్ష్మితోపాటు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. నా ఆత్మహత్యకు అధికారులు, కుటుంబ సభ్యుల ఒత్తిడి లేదని.. తల తిమ్మిర్లు, విపరీతమైన తలనొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నా అంటూ సూసైడ్ నోట్ రాసి పట్టణ శివారులోని లింగంపేట కర్ణంకుంట చెరువు వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జగిత్యాల పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

భవనం పైనుంచి పడి..
గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు

వేములవాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలో ప్రధానరహదారి విస్తరణలో శిధిలాల నుంచి ఇనుప వస్తువులను సేకరించేందుకు వచ్చిన ఓ గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం ఓ భవనంపై నుంచి కిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేణుగోపాలస్వామి ఆలయం ఎదురుగా ఉన్న రాజన్న ఆలయానికి సంబంధించిన వాణిజ్యదుకాణాలు విస్తరణలో పోతుండగా భవనం పైన ఉన్న సలాకలను సేకరించేందుకు ఎక్కిన వ్యక్తి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. దీంతో అతడి తలకు, దవడకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు. వేములవాడ పట్టణంలో ప్రధాన రోడ్డు వెడల్పు నేపథ్యంలో ఇరువైపులా భవనాలను, ఇళ్లను పెద్ద ఎత్తున కూల్చివేస్తున్న క్రమంలో శిధిలాలలో లభించే స్టీల్, ఇనుము ఇతర వస్తువుల కోసం వివిధ ప్రాంతాల నుంచి కూలీలు తరలివస్తున్నారు. ఈక్రమంలోనే కూల్చివేసిన ఓ భవనం శిధిలాల నుంచి ఇనుప వస్తువులు సేకరించే క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది.

ఏపీకే ఫైల్స్‌తో జాగ్రత్త

డౌన్‌లోడ్ చేసుకుంటే ఫోన్ హ్యాక్ అయ్యే అవకాశం

మాల్‌వేర్లతో సైబర్ వల



వాట్సాప్ గ్రూప్‌లో వచ్చిన ఏపీకేలు

చొప్పదండి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలానికి చెందిన ఒక వ్యక్తి ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూపులో ఎస్‌బీఐ యాప్, పీఎం కిసాన్ పేరిట అండ్రాయిడ్ ప్యాకేజీ కిట్ పేరుతో ఏపీకేలు ప్రత్యక్షమయ్యాయి. వాటిని డౌన్‌లోడ్ చేసిన వారి ఫోన్లు హ్యాక్ అయ్యాయి. ప్రతి రోజు ఏదో ఒక గ్రూపులో ఇలాంటి ఏపీకేలు సైబర్ నేరగాళ్లు పోస్టు చేస్తూనే ఉన్నారు.

ప్రభుత్వ పథకాలు, బ్యాంక్ ఆఫర్ల పేరుతో..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా ప్రవేశపెట్టిన పథకాల పేర్లతో సైబర్ నేరగాళ్లు మాల్‌వేర్లను వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేస్తున్నారు. వీటి గురించి అవగాహన లేని వారు ఇన్‌స్టాల్ చేసుకుని తమ విలువైన వ్యక్తిగత డాటాతోపాటు నగదును పోగొట్టుకుంటున్నారు. సభ్యులు ఎక్కువగా ఉండే వాట్సాప్ గ్రూపులను నేరగాళ్లు ఎంచుకుని ఏపీకేల లింకులను పోస్టు చేస్తున్నారు. గ్రూపు సభ్యులు తమ ఫోన్ హ్యాక్ అయికచందని తెలుసుకునేలోగానే అతడి నంబర్‌తో ఉన్న మిగతా గ్రూపులలోకి ఏపీకేలను పంపిస్తుంటారు. ప్రముఖ బ్యాంకులు, పీఎం కిసాన్, కామన్ సర్వీస్ సెంటర్‌తోపాటు ఇతర పేర్లతో ఏపీకేలను ఫార్వర్డ్ చేస్తున్నారు. దీంతో మొబైల్‌లో వాట్సాప్ కూడా పనిచేయదు.

అప్రమత్తంగా ఉండాలి..

మొబైల్‌లో ఏదైనా యాప్‌ను ఇన్‌స్టాల్ చేయాలనుకుంటే గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ స్టోర్ నుంచి మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలి. బయట వ్యక్తులు పంపే లింకులు, ఏపీకేలను డౌన్‌లోడ్ చేసుకోవద్దు. డౌన్‌లోడ్ చేసుకోవాలనుకుంటే గూగుల్ ప్లే స్టోర్‌లో యాప్ ఉందా లేదా చెక్ చేసుకోవాలి. ఇలా కాకుండా నేరగాళ్లు పంపించే లింకులను డౌన్‌లోడ్ చేసుకుంటే నష్టపోయే అవకాశం ఉంది. ప్రభుత్వ పథకాలు, బ్యాంకు యాప్‌లు, సబ్సిడీలు లాంటి యాప్‌ల పేరిట వాట్సాప్ గ్రూపుల్లో సర్క్యులేట్ అయ్యే పోస్టులను పట్టించుకోవద్దు. సరైన అవగాహన లేకుండా లింకులను డౌన్‌లోడ్ చేసుకుంటే వ్యక్తిగత సమాచారం చోరీకి గురయ్యే ప్రమాదం ఉంది.



రెండు బైకులు ఢీ: ఒకరికి గాయాలు

శంకరపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నంమండలం మెట్‌పల్లి గ్రామశివారులో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. జమ్మికుంట మండలం మాచనపల్లి గ్రామానికిచెందిన సముద్రాల అనిల్ శంకరపట్నం మండలం లింగాపూర్‌లో వారి బంధువుల అంత్యక్రియలకు వచ్చి తిరిగి మాచనపల్లికి వెళ్తున్నాడు. ఈక్రమంలో మెట్‌పల్లి గ్రామశివారులోని వైన్స్‌దగ్గర రెండుబైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అనిల్‌కు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో క్షతగాత్రుడిని హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

కరీంనగర్ క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నిర్మల్‌కు చెందిన కె పుష్పలత కొద్దిరోజుల కిందట కరీంనగర్‌రూరల్ మండలం నగునూర్‌లో తన సెల్ ఫోన్‌ను పోగొట్టుకుంది. కరీంనగర్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ఆధారంగా ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ నిరంజన్‌రెడ్డి ఆమెకు సెల్‌ఫోన్ అందజేశారు. ఈ సందర్భంగా ఫోన్‌ను వెదికిపట్టుకోవడంలో కృషిచేసిన కరీంనగర్‌రూరల్ కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

బైక్‌ల చోరీ కేసుల్లో ఆరుగురి అరెస్టు

● 33 ద్విచక్రవాహనాల స్వాధీనం
● వివరాలు వెల్లడించిన సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలో ద్విచక్రవాహనాల దొంగతనాల కేసులో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 12 లక్షల 27 వేల రూపాయల విలువైన 33బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం కమిషనరేట్ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కరీంనగర్ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పద్మనగర్‌లో పోలీసులు శుక్రవారం ఉదయం వాహనాల తనిఖీ చేపట్టారు. రెండు ద్విచక్రవాహనాలపై ట్రిపుల్‌రైడింగ్‌లో వెళ్తున్న ఆరుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. అదుపులోకి తీసుకుని విచారించగా కరీంనగర్ కమిషనరేట్, సిరిసిల్ల జిల్లా పరిధిలో మొత్తం 33ద్విచక్రవాహనాలు దొంగిలించినట్లు వెల్లడైంది. ఈ దొంగతనాలకు సంబంధించి మొత్తం ఆరు పోలీస్ స్టేషన్లలో 22 కేసులు నమోదయ్యాయి.

● పోలీసులు అరెస్టు చేసిన నిందితుల వివరాలు..

- మహబూబ్‌నగర్ జిల్లా, వెంకిచర్లకు చెందిన పంతుల నవీన్(24), గన్నేరువరం, చొక్కారావుపల్లెకు చెందిన పెంటి బాలు (24), సిరిసిల్ల జిల్లా, చందుర్తి మండలం మల్యాలకు చెందిన పెద్ది నాగరాజు(29), ముత్తారం మంథని మండలం, కేశినపల్లి గ్రామానికి చెందిన చిందం సాయి ప్రసాద్ (24), గంగాధర మండలం, లింగంపల్లికి చెందిన తోట మధు (28), సిరిసిల్ల జిల్లా, ఇల్లంతకుంటకు చెందిన కుంబాల సురేష్(35)ను కరీంనగర్ టూ టౌన్, సీసీఎస్ పోలీసులు సంయుక్త ఆపరేషన్‌లో అరెస్టుచేశారు. ప్రజలు వాహనాల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని సీపీ గౌస్‌ఆలం తెలిపారు. నిందితులను పట్టుకొని, చోరీకి గురైన 33బైకులు స్వాధీనం చేయడంలో కృషిచేసిన టౌన్‌ఏసీపీ వెంకటస్వామి, సీఐ సృజన్‌రెడ్డి, సీసీఎస్ సీఐ శ్రీనివాస్, కోటేశ్వర్, జాన్‌రెడ్డి, టూటౌన్ ఐడీ పార్టీ సిబ్బంది మల్లన్న, సాయికరణ్, వెంకటి తదితరులకు రివార్డు అందజేసి అభినందించారు.


స్వాధీనం చేసుకున్న బైక్‌లను పరిశీలిస్తున్న సీపీ గౌస్ ఆలం

● పోలీసుఠాణాలవారీగా కేసుల సంఖ్య, స్వాధీనం చేసుకున్న బైక్‌ల వివరాలు

- కరీంనగర్ వన్ టౌన్ 6 కేసుల్లో 11 బైక్‌లు స్వాధీనం
- కరీంనగర్ టూ టౌన్ 8 కేసుల్లో 9 బైక్‌లు
- కరీంనగర్ త్రీ టౌన్ ఒక కేసులో ఒక బైక్
- కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ 2 కేసుల్లో 2 బైక్‌లు
- కరీంనగర్ కొత్తపల్లి పోలీస్ స్టేషన్ 3 కేసుల్లో 3 బైక్‌లు
- రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పోలీస్ స్టేషన్‌లో 2 కేసులలో 2.
- సరైన వివరాలు లేని మరో 5 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు

పీడీఎస్ బియ్యం పట్టివేత


పట్టుకున్న రేషన్ బియ్యం, రవాణాదారులతో పోలీసులు

గంభీరావుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంతోపాటు రెండు ద్విచక్రవాహనాలను గంభీరావుపేట మండలం ముస్తఫానగర్ గ్రామ శివారులో పట్టుకున్నామని ఎస్ఐ రమాకాంత్ శుక్రవారం తెలిపారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం భవానీపేటకు చెందిన భూక్య నరేందర్, బానోతు మోహన్‌లు తమ ద్విచక్రవాహనాలపై గ్రామాల్లో తిరుగుతూ ప్రజల నుంచి పీడీఎస్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి కామారెడ్డి జిల్లా కేంద్రానికి రవాణా చేస్తున్నారని పేర్కొన్నారు. ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, కానిస్టేబుళ్లు శ్రీను, కరీంలు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో బియ్యం తరలిస్తూ నరేందర్, మోహన్‌లు పట్టుబడ్డారని చెప్పారు. బియ్యం, రెండు వాహనాలను స్వాధీనపర్చుకున్నామని పేర్కొన్నారు. రవాణాదారులు నరేందర్, మోహన్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్థులు


గ్రామస్థులు అడ్డుకోవడంతో నిలిచిపోయిన ఇసుక ట్రాక్టర్లు

చందుర్తి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం మూడపల్లిలో శుక్రవారం ఇసుక ట్రాక్టర్లను గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ వేములవాడ రూరల్ మండలంలోని మల్లారం నుంచి ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక తరలించే క్రమంలో ఇసుక ట్రాక్టర్లు మితిమీరిన వేగంతో రాత్రి, పగలు తేడా లేకుండా విచ్చలవిడిగా ట్రాక్టర్లు నడవడంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని భయానికి గురికావాల్సి వస్తుందన్నారు. ఇళ్ల మధ్యలో నుంచి ట్రాక్టర్లు వెళ్లడంతో ఇటీవల ఓ బాలుడు ప్రమాదం నుంచి తప్పించుకొని బయటపడ్డాడన్నారు. మైనర్లు ట్రాక్టర్లను నడుపుతున్నారన్నారు. పోలీసులు ప్రమాదాలు జరగకముందే చర్యలు చేపట్టాలని కోరారు. ట్రాక్టర్లవేగాన్ని నియంత్రించాలని గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. గ్రామంలో రోడ్డుపై ట్రాక్టర్లు వెళ్లే సమయంలో దుమ్ము లేవకుండా క్యూరింగ్ పనులు చేపట్టాలన్నారు. దాదాపు అరగంట సేపు ఆందోళన చేపట్టడంతో ఇసుక నిలిచిపోయాయి. సంఘటన స్థలానికి పోలీసులుచేరుకొని గ్రామస్థులతో మాట్లాడడంతో ఆందోళన విరమించారు.

అయస్కాంతంతో నడిచే క్రేన్

● క్రియేటివిటీని అభినందించి స్టేటస్‌లో పెట్టుకున్న కలెక్టర్

గంగాధర, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థి అయస్కాంతంతో నడిచేక్రేన్‌ను తయారు చేయగా కలెక్టర్ తనస్టేటస్‌లో పెట్టుకున్నారు. జిల్లాలోని ప్రభుత్వపాఠశాల విద్యార్థుల ప్రయోగాలు జిల్లావ్యాప్తంగా ఏర్పాటుచేసిన గ్రూప్‌లో అప్‌లోడ్ చేస్తారు. బూరుగుపల్లి పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న సాత్విక్ గేర్‌మోటార్, 9వోల్ట్‌బ్యాటరీ, మ్యాగ్నెట్, రిమోట్, క్లిప్స్, పైపులను ఉపయోగించి అయస్కాంత క్రేన్ తయారుచేశాడు. దాని ఉపయోగాల వివరాలు గ్రూప్‌లో అప్‌లోడ్ చేశాడు. విద్యార్థి ప్రయోగాన్ని పరిశీలించిన కలెక్టర్ ప్రయోగ వీడియోను తన స్టేటస్‌లో పెట్టుకునిఎక్సలెంట్‌అని అభినందించారు.


విద్యార్థి తయారు చేసిన క్రేన్

పదో తరగతి విద్యార్థి అదృశ్యం


శ్రీకర్(ఫైల్)

ఇబ్రహీంపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్‌లో పదోతరగతి విద్యార్థి కందుకూరి శ్రీకర్ (15) అదృశ్యమయ్యాడని శుక్రవారం తల్లిదండ్రులు ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. శ్రీకర్ వేములకుర్తి ప్రభుత్వపాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. గురువారం పాఠశాలకు వెళ్తున్నానని చెప్పి వెళ్లి ఇంటికిరాలేదు. ఎంత వెతికినా ఆచూకీ తెలియలేదు. శుక్రవారం ఉదయం శ్రీకర్ తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడగాస్కూల్ ప్రారంభం నుంచి బడికిరాలే దని తెలపడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

గొడవలు సృష్టిస్తున్న యువకులకు కౌన్సెలింగ్

● తహసీల్దార్ ఎదుట బైండోవర్

కోల్‌సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని విఠల్‌నగర్‌లో కొంతమంది యువకులు మద్యం, గంజాయి మత్తులో రెండురోజులక్రితం రోడ్డుపై గొడవలు పడగా శుక్రవారం గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. విఠల్‌నగర్‌కు చెందిన పలువురు యువకులు రెండురోజుల క్రితం స్నేహితుని పుట్టినరోజు వేడుకలవిషయంలో గొడవపడ్డారు. కత్తులు పట్టుకుని బూతులుతిడుతూ భయభ్రాంతులకు గురిచేశారు. దీనికి సంబంధించి వీడియోలు వైరల్ అయ్యాయి. సీఐ ఇంద్రసేనారెడ్డి సదరుయువకులను వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. తల్లిదండ్రులు ఎప్పుడూ పిల్లలను గమనిస్తుండాలని, వారు ఎవరితో స్నేహం చేస్తున్నారు.. వారి స్నేహితుల ప్రవర్తనలు, అలవాట్లగురించి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం యువకులను ముందస్తు చర్యల్లో భాగంగా ఒక సంవత్సరంపాటు ఎలాంటి చెడుప్రవర్తన చేయకుండా రామగుండం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

దొంగ అరెస్టు

● నాలుగు తులాల బంగారం రికవరీ


దొంగను అరెస్టు చూపుతున్న సీఐ ప్రదీప్‌కుమార్

గంగాధర, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మాయమాటలు చెప్పి వృద్ధురాలి బంగారం ఎత్తుకెళ్లిన దొంగను అరెస్టు చేసినట్లు చొప్పదండి సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. గంగాధర పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 14న వేములవాడ మండలం నమిలిగుండుపల్లికి చెందిన వజ్రమ్మ(80) గంగాధర బస్ స్టాండ్‌లో దిగి ఆసుపత్రికి వెలుతోంది. సిద్దిపేటకు చెందిన అల్లెపు క్రిష్ణ నేను మీ గ్రామ కార్యదర్శినంటూ పరిచయం చేసుకున్నాడు. పింఛన్ ఇప్పిస్తానని మాయ మాటలు చెప్పి వజ్రమ్మ వద్దనున్న బంగారు గొలుసు, చెవి కమ్మలు తీసిస్తే ఫోటో దింపుతానని నమ్మబలికాడు. నమ్మిన వజ్రమ్మ తనవద్దనున్న బంగారు గొలుసు, చెవి కమ్మలు తీసి నిందితుడి చేతిలో పెట్టింది. ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకురావాలని వజ్రమ్మను పంపించి బంగారంతో ఉడాయించాడు. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై వంశీక్రిష్ణ సీసీ ఫుటేజీల ఆధారంగా విచారణ చేపట్టారు. శుక్రవారం అదేవ్యక్తి తిరిగి గంగాధర బస్ స్టాండ్‌లో మరోమహిళ వద్ద బంగారం చోరీ చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి నాలుగు తులాల బంగారం రికవరీ చేసినట్లు ఆయన తెలిపారు. నిందితుడిపై నర్సంపేట, బాన్సువాడతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 86కేసులున్నట్లు తెలిపారు. కేసు చేదించుటలో పాల్గొన్న గంగాధర ఎస్సై వంశీక్రిష్ణ, సీసీఎస్ ఎస్సైలు శ్రీనివాస్, నాగరాజుతో పాటు పోలీసులను సీఐ అభినందించారు.

వంతెన నిర్మాణానికి మోక్షమెప్పుడో?

● ప్రతి ఏటా వానాకాలం కష్టాలే
● ఏళ్లుగా ఎదురుచూపులు..


పాతర్లపల్లిలో తెగిపోయిన చెక్‌డ్యాం (ఫైల్)

ఇల్లందకుంట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని పాతర్లపల్లె వాగుపై వంతెన నిర్మాణం కలగానే మారింది. వర్షాకాలం వచ్చిందంటే చాలు గ్రామ ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు తప్పవు. మల్యాల గ్రామం నుంచి నిత్యం వాగు పారుతుంది. భారీ వర్షాల కారణంగా చిన్నగా వంతెన ఉండడం వల్ల పైనుంచి నీరు ప్రహించడంతో పాటు సమీపంలో ఉన్నటువంటి గ్రామపంచాయతీ, ఇళ్లలోకి నీరుచేరి గ్రామానికి రాకపోకలు స్తంభించి పోతాయి. ఈ సమస్య ఏళ్ల గడుస్తున్నా పరిష్కారం కావడం లేదు. ప్రతి ఏటా వర్షాల కారణంగా వాగు ఉప్పొంగినప్పుడు మట్టి కొట్టుకపోవడం, కల్వర్టు మీద నుంచి ప్రవహించడం జరుగుతుంది. ఆ సమ యంలో అధికారులు వచ్చి అప్రమత్తంగా ఉండాలని చెబుతూ చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతానికి ఎమ్మెల్యే ఈటల రాజేందర్ గెలిచిన తర్వాత హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతానని హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత పాలకులు సైతం ఈ గ్రామ వంతెనపై స్పందన లేదు.

గ్రామస్థులు ప్రతిఏటా వంతెన సమస్యను ప్రజాప్రతినిదుల దృష్టికి తీసుకెళ్లినా ఆచరణలోకి రావడం లేదు. ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించి నిర్మాణపనులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

● 25 ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం.

- కోడం శంకర్, గ్రామస్థుడు, పాతర్లపల్లి



గ్రామానికి వంతెన నిర్మిస్తారని 25ఏళ్లగా ఎదురుచూస్తున్నాం. మా బాధలు ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు వెంటనే వంతెన నిర్మాణం కోసం నిధులు కేటాయించి పనులు ప్రారంభిస్తే బాగుంటుంది.

● వానాకాలం వచ్చిందంటే భయపడుతాం

- బైరెడ్డి రమణారెడ్డి, గ్రామస్థుడు, పాతర్లపల్లి



ప్రతిఏటా వానాకాలం వచ్చిందంటే వాగు ఉప్పొంగడం వల్ల భయపడాల్సి వస్తుంది. వాగు ఉప్పొంగడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోతాయి. రవాణాపూర్తిగా స్తంభించి పోతుంది. మా గ్రామానికి వంతెన నిర్మాణ పనులకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలి.

పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి కృషి

కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా కలిసి పని చేస్తానని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు రూ.77.2 కోట్ల అంచనాతో చేపట్టిన



ఫోర్‌లైన్ విస్తరణ పనుల శంకుస్థాపన కార్యక్రమంతోపాటు హుస్నాబాద్‌లో ఆస్పత్రి, తదితర కార్యక్రమాలకు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆహ్వానించారని, ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఛండీగఢ్ వెళ్లాల్సివచ్చిందని తెలిపారు. దీంతో హుస్నాబాద్ కార్యక్రమాలకు హాజరు కాలేక పోయానని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం తరఫున తనను ఆహ్వానించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహకు ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర మంత్రిగా కొనసాగుతున్న తాను కరీంనగర్ పార్లమెంట్ ప్రజల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు సైతం రాష్ట్ర ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజక వర్గాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

పెద్దపల్లి ఆర్‌వోబీ వద్ద విరిగిన క్లస్టర్

- ఆరు గంటల పాటు రైళ్ల రాకపోకలకు అంతరాయం
- ఆయా స్టేషన్లలో నిలిచిన రైళ్లు.. పలు రైళ్లు పాక్షికంగా రద్దు
- పునరుద్ధరణతో ఆలస్యంగా నడిచిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్



కూనారం రోడ్డులో ఆర్‌వోబీ పనులు చేపడుతుండగా విరిగి పోయిన క్లస్టర్

పెద్దపల్లి/పెద్దపల్లి రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి రైల్వే జంక్షన్ సమీపంలో కూనారం రోడ్డులో నిర్మిస్తున్న ఆర్‌వోబీ దగ్గర క్లస్టర్ విరిగిపోయి గడ్డర్లు కుంగడంతో ఖాజీపేట-బల్లార్షా రూట్‌లో ఆయా రైల్వేస్టేషన్లలో రైళ్లు ఎక్కడికక్కడే నిలిచి పోగా, కొన్ని రైళ్లను కొన్ని స్టేషన్ల వరకే పరిమితం చేశారు. ఆర్వోబీ నిర్మాణంలో భాగంగా రెండో లైన్‌లో రైల్వే ట్రాక్ మీదుగా ఐరన్ గడ్డర్లను అమర్చి దాని మీదుగా వంతెన శుక్రవారం ఉదయం ఐదు గంటల నుంచి అమర్చే పనిని ప్రారంభించారు. ఒక క్లస్టర్‌లో గడ్డర్ లోడ్‌కు సగానికి పైగా విరగడాన్ని గమనించిన ఇంజనీరింగ్ అధికారులు వెంటనే లైన్ గుండా రైళ్ల రాకపోకలను నిలిపివేయాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆ వెంటనే మరమ్మతు పనులను చేపట్టారు. ఉదయం ఆరు గంటల నుంచి ఎక్కడికక్కడే రైళ్లను నిలిపివేశారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ స్టేషన్‌లో భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌తో పాటు పలు రైళ్లు, గూడ్స్ రైళ్లు నిలిచిపోయాయి. ఉదయం 11:50 గంటలకు మరమ్మతు పనులు పూర్తికావడంతో రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు.



రాఘవాపూర్ రైల్వే స్టేషన్‌లో నిలిచి పోయిన రైళ్లు

● రైళ్ల రాకపోకలకు అంతరాయం..

పెద్దపల్లి పట్టణంలోని కూనారం రోడ్డులో జరుగుతున్న ఆర్వోబీ పనుల వల్ల క్లస్టర్ విరిగి పోయి గడ్డర్లు కుంగడంతో ఖాజీపేట- బల్లార్షా లైన్‌లో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇంటర్ సిటీ, సిర్పూర్ కాగజ్‌నగర్, రామగిరి, సింగరేణి మెమో ఎక్స్‌ప్రెస్ రైళ్లను పాక్షికంగా రద్దు చేయగా, దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లు యథాతథంగా నడిచాయి. సికింద్రాబాద్ నుంచి నాగపూర్‌కు నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్ నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు బదులు మూడు గంటల ఆలస్యంగా సాయంత్రం నాలుగు గంటలకు బయలు దేరింది. అలాగే రైలు నంబర్ 17011/12 హైదరాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్‌కు అక్కడి నుంచి బీదర్ వరకు వెళ్లే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు పోత్కపల్లి వరకే నడిపించారు. రైలు నంబర్ 12757/58 సికింద్రాబాద్ నుంచి సిర్పూర్‌కాగజ్ నగర్ నుంచి సికింద్రాబాద్ కాగజ్‌నగర్ వరకు నడిచే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును పాక్షికంగా ఇరువైపులా రద్దు చేశారు. ఈ రైలును కేవలం కాజీపేట నుంచి సికింద్రాబాద్ మధ్యే నడిపించారు. రైలు నంబర్ 17033 భద్రాచలం రోడ్డు నుంచి బల్లార్షా వైపు వెళ్లే సింగరేణి మెము ఎక్స్‌ప్రెస్ రైలును వరంగల్ నుంచి బల్లార్షా మధ్య పాక్షికంగా రద్దు చేశారు, 17034సింగరేణి రైలు వరంగల్ నుంచి భద్రాచలం రోడ్డు వరకు నడిపించారు. రైలు నంబర్ 17003 కాజీపేట నుంచి సిర్పూర్ వైపు వెళ్లే మెమో ఎక్స్‌ప్రెస్ రైలును పోత్కపల్లి వరకే నడిపించి పోత్కపల్లి నుంచి సిర్పూర్ టౌన్ వరకు పాక్షికంగా రద్దు చేశారు. బోధన్ నుంచి సిర్పూర్ టౌన్‌కు అక్కడి నుంచి బోధన్‌కు నడిచే పుష్ పుల్ రైలును పూర్తిగా రద్దు చేశారు. సికింద్రాబాద్ వైపు వెళ్లే రైలు నంబర్ 17234 భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలును పాక్షికంగా కాజీపేట నుంచి సికింద్రాబాద్ మధ్య రద్దు చేశారు. ఇదే రైలు 17202 గుంటూరు వైపు గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌గా కాజీపేట నుంచి నడిపించారు.

జమ్మికుంటలో రెండు గంటలు నిలిచిన ఎక్స్‌ప్రెస్ రైళ్లు

జమ్మికుంట: జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో శుక్రవారం పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిచిపోయాయి. పెదపల్లిలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబి) నిర్మాణ పనులు జరుగుతుండగా ఒక పిల్లర్ కుంగింది. దీంతో జమ్మికుంటలో తెలంగాణ, రాజధాని ఎక్స్‌ప్రెస్‌లను నిలిపివేశారు. సుమారు రెండు గంటల పాటు నిలిపి వేయ డంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. రాఘవపురంలో భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్, ఉప్పల్‌లో ఇంటర్సిటీ ఎక్స్‌ప్రెస్‌లు నిలిచి పోగా ప్రయాణీకులు గంటల కొద్దీ రైల్వేస్టేషన్‌లో వేచి చూశారు. రైళ్లు ఆలస్యంగా నడుస్తుండటంతో కొంత మంది ఇళ్లకు తిరుగుముఖం పట్టారు.

శాతవాహన యూనివర్సిటీలో తీజ్ ఉత్సవాలు



ఉత్సవాలలో పాల్గొన్న వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వ విద్యాలయంలో బంజారాల సంప్రదాయమైన తీజ్ ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎస్సీ ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన ఉత్సవాలను యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఉమేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీజ్ ఉత్సవాలు బంజారాల సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకని అన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సూరేపల్లి సుజాత, ఓఎస్‌డీ టు వీసీ డాక్టర్ హరికాంత్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయంతి తదితరులు పాల్గొన్నారు.

ఖని బస్టాండ్ నుంచి యాదగిరి గుట్టకు ప్రత్యేక బస్సు

జెండా ఊపి ప్రారంభించిన డీఎం నాగభూషణం



పుణ్యక్షేత్ర బస్సుకు జెండా ఊపుతున్న డీఎం నాగభూషణం

కళ్యాణ్‌నగర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): యాత్రికుల కోసం పుణ్య క్షేత్రాలకు ఇటీవల ఆర్టీసీ టూర్ ప్యాకేజీతో సర్వీసులను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం ఐదు గంటలకు గోదావరిఖని బస్టాండ్ నుంచి యాదగిరిగుట్ట, స్వర్ణదేవాలయానికి సూపర్ లగ్జరీ సర్వీసును ఏర్పాటు చేయగా డిపో మేనేజర్ నాగభూషణం జెండా ఊపి ప్రారంభించారు. 37మంది భక్తులతో ఈ బస్సు మొదట యాదగిరిగుట్టలో లక్ష్మీ నరసింహస్వామి దర్శనం అనంతరం స్వర్ణగిరిలోని వెంకటేశ్వరస్వామి పుణ్యక్షేత్రాన్ని సందర్శించనున్నట్టు తెలిపారు. దర్శనం అనంతరం రాత్రి 10 గంటలకు గోదావరిఖనికి చేరుకుంది. భక్తుల వెంట కో ఆర్డినేటర్లు కేఆర్ రెడ్డి, ఎస్ఎస్ మూర్తి ఉన్నారు. అసిస్టెంట్ మేనేజర్ గీత కృష్ణ పాల్గొన్నారు.

కొండగట్టులో స్థానికులకు సులువైన దర్శనం కల్పించాలి



ఈవో శ్రీకాంత్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

మల్యాల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ముత్యంపేట గ్రామస్థులకు కొండగట్టు అంజన్న దర్శనం అసౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ సమన్వయ సంఘం ఆధ్వర్యంలో ఈవో శ్రీకాంత్‌రావుకు వినతిపత్రం అందజేశారు. పలుమార్లు స్థానికుల దర్శన సమయంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాటిని పరిష్కరించాలని ఈవోతో అన్నారు. అలాగే దేవస్థానం పరిధిలో మరింత అభివృద్ధికి దేవస్థానం తరుపున పాటుపడాలని, భక్తులు కొండపై ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సమన్వయ సంఘం అధ్యక్షుడు సామ మహిపాల్‌రెడ్డి, ముల్క మల్లయ్య, త్రినాథ్, సంజీవ్, రాజేశ్, అజయ్‌రావు, అంజన్‌రావు, రమేశ్, గంగమల్లు, పన్నాటి మల్లేశం, గుర్రం మల్లేశంగౌడ్, మధు, గౌతం, శ్రీనివాస్ ఉన్నారు.

కల్వర్టు పనులను అడ్డుకున్న రైతులు

కోనరావుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : సుద్దాల ఎక్స్ రోడ్డు నుంచి మంగళపల్లె వరకు చేపట్టిన తారు రోడ్డు నిర్మాణంలో భాగంగా చేపట్టిన కల్వర్టు పనులను సుద్దాల-మంగళపల్లి రైతులు అడ్డుకున్నారు. సుద్దాల ఎక్స్ రోడ్డు నుండి మంగళపల్లి గ్రామాల మధ్యన కల్వర్టు తొలగించి గతంలో కంటే భారీ పైపులు వేయడం వల్ల పంట చేనులు కొట్టుకపోతాయని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. గతంలో ఉన్న కల్వర్టు వల్ల భారీ వర్షాలకు నష్టపోయామని, మరింత పెద్ద పైపులు వేయడం వల్ల పంటలు చేతికి రావని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న మాదిరిగా నిర్మిస్తే మల్కపేట రిజర్వాయర్ విడుదల చేసిన నీరే కాకుండా వర్షాకాలపు నీరు కూడా గతంలో పోవడం వల్ల మంగళపల్లె బతుకమ్మ కుంట నుంచి మారుపాక చెరువులోకి వెళ్లిపోతాయని అన్నారు. అలాకాకుండా సదరు కాంట్రాక్టర్ ఇప్పుడు చేపట్టే కల్వర్టు పనుల్లో పెద్ద పైపులు వేయడం వల్ల సుమారు 15 ఎకరాలు పంటలు కొట్టుకపోతాయని అన్నారు. అధికారులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించి రైతులకు నష్టం జరగకుండా కల్వర్టు పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

బోనాల పండుగలో వృత్తి కళాకారుల ప్రదర్శనలకు ఆహ్వానం

కరీంనగర్ అర్బన్, జూన్ (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో బోనాల పండుగలో ఈ నెల 25 నుంచి 29 వృత్తి కళాకారుల ప్రదర్శనలు, ఉత్పత్తుల అమ్మకాలు నిర్వహించేవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎం అనిల్ ప్రకాశ్ కిరణ్ ఒక ప్రకటనలో కోరారు. హైదరాబాద్ అంబేద్కర్ విగ్రహం, ఐమాక్స్ పక్కన ఓపెన్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శన, అమ్మకాల కోసం జిల్లాలోని కుమ్మరి, చేనేత, మేదరి, వడ్రంగి, పూసల తదితర బీసీ వృత్తి కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులతో ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటిని కొనుగోలు చేసి వృత్తి కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రదర్శనను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎంబీసీ నిరుద్యోగ యువతకు వివిధ నైపుణ్య శిక్షణ

కరీంనగర్ అర్బన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అత్యంత వెనుబడిన తరగతుల అభివృద్ధి సంస్థ(టీజీఎంబీసీడీసీ) ఆధ్వర్యంలో ఎంబీ సీ నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ నైపుణ్యాలను పెంపొందించేం దుకు హైదరాబాద్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు టీజీఎం బీసీడీసీ ముఖ్యకార్యనిర్వహణ అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి జూలై 12వ తేదీ వరకు 15 రోజులు ఆన్‌లైన్ వెబ్‌సైట్ tgobmms.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు ఫారాలను సంబంధిత ధ్రువపత్రాలను జతపరచి, జిల్లాల్లోని బీసీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో జూలై 14వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాలన్నారు. అభ్యర్థులకు 4 రోజుల శిక్షణ అందిస్తారని, ట్రావెలింగ్ అలవెన్స్, భోజన, వసతి సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు.

పీఎం కిసాన్ కోసం ఎదురు చూపులు



గన్నేరువరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతులకు అందించే సంక్షేమ పథకాల్లో ఒకటి ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకం. ఈ పథకంలో చేరిన రైతులకు పంటల పెట్టుబడికి మూడు విడతలుగా ప్రతి నాలుగు నెలలకు ఒకసారి 2 వేల చొప్పున మొత్తం సంవత్సరానికి 6 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందిస్తుంది. చిన్న, సన్నకారు రైతులు కుటుంబంలో ఒక్కరికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకంలో చివరగా 2019 మార్చి వరకు చేరిన రైతులకు మాత్రమే పీఎం కిసాన్ డబ్బులు పడుతున్నాయి. ఆ తరువాత నుండి ఇప్పటి వరకు ఎంత మంది రైతులు ధరఖాస్తు చేసుకున్నా పథకానికి ఎంపిక కావడం లేదు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకానికి 2019 మార్చి వరకే కటాఫ్ తేదీని పెట్టడంతో అనేక మంది రైతులు ఈ పథకంలో చేరేందుకు ఎదురుచూస్తున్నారు. గన్నేరువరం మండలంలో మొత్తం 7,542 మంది రైతులు ఉండగా ప్రస్తుతానికి 3,055 మంది రైతులు మాత్రమే పీఎం కిసాన్ పథకం ద్వారా పంట పెట్టుబడి సాయాన్ని పొందుతున్నారు. దీంతో మిగతా రైతులు కటాఫ్ తేదీ పెంపు కోసం ఎదురుచూస్తున్నారు.

కేంద్రం కొత్తగా కటాఫ్ తేదీ ప్రకటించలేదు: మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి



పీఎం కిసాన్ పథకంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్ట కపోవడంతో అనేక మంది అర్హులైన రైతులు పథకానికి ఎంపిక కావడం లేదు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి అర్హులైన రైతులను ఎంపిక చేసేందుకు ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి కటాఫ్ తేదీని పెట్టింది. 2019 మార్చిలో కటాఫ్ తేదీ అమలు చేసాక మళ్లీ ఆరు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ కటాఫ్ తేదీని పెంచ లేదు.

అత్తపై హత్యాయత్నం.. అల్లుడికి ఏడాది జైలు

సిరిసిల్ల క్రైం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అత్తపై హత్యాయత్నానికి పాల్పడిన ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన వేముల శేఖర్(32)కు ఒక ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 500 జరిమానా విధిస్తూ శుక్రవారం సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారి తీర్పు వెల్లడించారు. ఎస్పీ మహేశ్ బి. గీతే వివరాల ప్రకారం.... 2021లో తన అత్త వేముల శాంతవ్వపై దాడి చేసి కొట్టి కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితురాలు ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ బన్సీలాల్ కేసు నమోదుచేశారు. ఈ కేసులో పోలీసులు చార్జీ షీట్ దాఖలు చేయగా కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీంద్రనాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్ సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టారు. పీపీ వేముల లక్ష్మీప్రసాద్ వాదనలు వినిపించగా కేసుపూర్వాప రాల ను పరిశీలించిన సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారి నిందితుడికి ఏడాది జైలు శిక్ష రూ. 500జరిమానా విధించారని ఎస్పీ మహేశ్ బి. గీతే తెలిపారు.

గోరింటా.. పండింది

- అతివల అరచేతికి అందం
- ఆరోగ్యానికీ మంచిది
- ఆషాఢ మాసం ప్రత్యేకం



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

తొలకరి జల్లులతో వచ్చే ఆషాఢం.. అతివల అందాన్ని పెంచే గోరింటను తెస్తుంది. తొలకరితోనే గోరింట చిగురిస్తుంది. ఆషాఢ మాసంలో అతివలు చేతులు, కాళ్లకు గోరింటాకు పెట్టుకోవడం ఆరోగ్యానికి మంచిదిగా భావిస్తారు. కొత్తగా పెళ్లయిన యువతులు సంప్రదాయంగా పాటిస్తారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు గోరింటాకు పెట్టుకొని మురిసిపోతారు. గోరింటాకు పెట్టుకోవడం అయిదోతనంగా, ముత్తయిదవుల నమ్మకంగా, పెళ్లికాని అమ్మాయిలకు గోరింట బాగా పండితే మంచి మొగుడు వస్తాడని భావిస్తారు. ఇందుకోసం మహిళలు గోరింటతో ప్రత్యేక డిజైన్లు వేసుకోవడం కనిపిస్తుంది.

మన సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా మహిళలు గోరింటాకుతో ఆకర్షణీయమైన డిజైన్లను వేసుకోవడాని పోటీపడుతారు. కొత్తగా పెళ్లయిన యువతులు గోరింటాకుతో సంబరాలు జరుపుకుంటారు. డిజైన్లు వేయడానికి బ్యూటీ పార్లర్లకు వెళ్తుంటారు. మరోవైపు అందంతో పాటు గోరింటాకు ఆరోగ్యాన్ని కూడా కలిగిస్తుంది. గోరింటాకు స్వయంగా తయారుచేసుకోవడాని ఇష్టపడుతారు. పల్లెల్లో లేలేత ఆకులు తెచ్చు కొని రోటిలో మెత్తగా రుబ్బుకొని చింతపండు, పెరుగు కలుపుకొని చేతులకు అందంగా చందమామ, చుక్కల నెలవంక, బంతిపువ్వు, వేళ్ల చుట్టూ గొడుగులు పెట్టుకుంటారు. పాదాలకు పారాణి పెట్టుకుంటారు.

గోరింటలో ఔషధ గుణాలు..

గోరింటాకు కేవలం అందం కోసమే కాకుండా ఎన్నో ఔషధ గుణాలు కూడా ఉన్నాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అతివల చేతులు నీటిలో నానడంతో పుండ్లు, ఎలర్జీ వస్తుందని గోరింటాకులో యాంటీబయాటిక్ లక్షణాలు ఉండడం వల్ల కాళ్లకు, చేతులకు క్రిములు దరిచేరనీయకుండా ఉంచుతాయని చెబుతారు. అంతే కాకుండా రక్తపోటు కూడా తగ్గిస్తుందని చెబుతారు. నువ్వుల నూనెలో గోరింటాకు వేసి మరిగించి తలకు రాసుకుంటే కాలేయ రోగాలకు, నేటిపూతను తగ్గిస్తుందని చెబుతారు. కీళ్లనొప్పులు, వాపు కూడా గోరింటాకుతో తగ్గిపోతుందని చెబుతారు.





మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కోల్‌సిటీటౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఈ నెల 29న జరుగనున్న మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంపల్లి సతీష్ పిలుపునిచ్చారు. గోదావరిఖని రామగుండం కార్పొరేషన్ కార్యాలయం వద్ద శుక్రవారం వారు మాట్లాడారు. ఈ నెల 29న కరీంనగర్‌లోని అల్గునూర్ ఏఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందని తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల, వృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, శాసన సభ్యులు హాజరవుతారని తెలిపారు. ఉదయం 10 గంట లకు కోర్టు చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, ఆలయ ఫౌండేషన్ నాయకులు మిట్టపల్లి రాజేందర్, బచ్చల రాజు, విజయ్, పోచయ్య, రవి, గాలిపల్లి సతీష్, రమేష్, జీవన్, చిరంజీవి, సది, కిష్టయ్య పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నం : వ్యక్తిపై కేసు

తంగళ్లపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22వ తేదీన తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో పురుగుల తాగి ఆత్మహత్యాయత్నం చేసిన తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన వేల్పుల కృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపారు. వ్యవసాయ భూమి విషయంలో తనపై కేసు నమోదుపై ఆరా తీయడానికి వచ్చి తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి బెదిరింపులకు పాల్పడటంతో సిరిసిల్ల కోర్టు అనుమతితో కృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కన్న రమేష్

సుల్తానాబాద్, జూన్ 27: (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కన్న రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో బీసీ సంక్షేమ సంఘం ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో బీసీలకు జరుగుతున్న అన్యాయం గురించి, బీసీల హక్కుల సాధన గురించి, రిజర్వేషన్ల అంశం గురించి చర్చించారు. అనంతరం కన్న రమేష్ మాట్లాడుతు రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన బీసీలకు అన్నిపార్టీల వారు అవకాశాలు కల్పించాలని కోరారు. ఉద్యోగ అవకాశాల్లో కూడా ఇదే విధంగా రిజర్వే షన్లను అమలు చేయాలన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరు ఎక్కువ మంది బీసీలకు అవకాశాలు కల్పిస్తే వారికి మద్దతు తెలపాలని నిర్ణయించారు. ప్రధాన రాజకీయ పార్టీలు బీసీలకు తగిన అవకాశాలు కల్పించి రాజకీయంగా ఎదిగేలా చూడాలన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఆసరి రాజయ్య, నాయకులు కుందేళ్ల తిరుపతి, మాదాసు గోవర్ధన్, ఆది కోటేశ్వర్‌రావు, కుందేళ్ల కనుకయ్య, సంకరి సంపత్, ఓదెలు, మహేష్, గున్నాల ప్రవీణ్, గౌతమ్, రజనీకాంత్, మారంపల్లి సంపత్, పయ్యావుల సంపత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కన్న రమేష్

ఓసీపీ-1 మేనేజర్‌కు సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ/రామగిరి జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఓసీపీ-1 మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరిం చిన రావుల పాపయ్యను శుక్రవారం ఐఎన్ టీయూసీ నాయకులు సన్మానించారు. ఓసీపీ-3 సేఫ్టీ ఆఫీసర్‌గా విధులు నిర్వహి స్తూ పదోన్నతిపై ఓసీపీ-1 మేనేజర్‌గా రావ డంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు. యూనియన్ సెంట్రల్ సెక్రెటరీ గడ్డం తిరుపతి పిట్ కమిటీ నాయకులను మేనేజ ర్‌కు పరిచయం చేశారు. కార్యక్రమంలో ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి, పిట్ సెక్రెటరీ వెంకటస్వామి, నాయకులు దామోద ర్‌రావు, సాంబయ్య, సదానందం ఉన్నారు.

జీఎంకు సత్కారం

రామగిరి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందనున్న కార్పొరేట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం జీఎం ఆర్. నారాయణరావును అధికారులు శుక్రవారం స త్కరించారు. సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజ న్‌లోని జీఎం కార్యాలయంలో జీఎం చాంబ ర్‌లో ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు శాలువ, పూలదండలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీఎల్ మాజీ డైరెక్టర్ మో హన్‌రెడ్డి, అధికారులు శేఖర్‌బాబు, రా మ్మోహన్, సత్యనారయణ, వెంకటరమణ, రా జశేఖర్, ప్రవీణ్, కాశీ విశ్వేశ్వర్‌రావు, జనార్దన్ రెడ్డి, చంద్రశేఖర్, సత్యనారయణ, భాను ప్రసాద్‌రావు, రాజేంద్రకుమార్, సుదర్శనం, షబ్బీరుద్దీన్, నాగేశ్వర్‌రావు, రాజేశ్వరి తదిత రులు పాల్గొన్నారు.

పన్నూరులో తాగునీటి పైప్‌లైన్‌ను మళ్లించండి

రామగిరి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సింగ రేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని పన్నూరులో విద్యుత్, తాగు నీటి పైప్‌లైన్ మళ్లింపు పనులు చేపట్టాలని పన్నూరు మాజీ ఎంపీటీసీ చిందం మహేష్ శుక్రవారం జీఎం సుధాకర్‌రావుకు వినతిపత్రం అందజే శారు. పన్నూరులో నూతన గృహ నిర్మాణం చేసుకోనే వారికి తరుచూ నీటి పైప్‌లైన్ పగిలి నీరు వెలువడుతోందన్నారు. పట్టా ల్యాండ్‌లో సింగరేణికి సంబంధించిన 33 కేవీ విద్యుత్ లైన్ మళ్లింపు పనులు చేపట్టాలని వినతిలో కోరారు. సెంటినరీకాలనీ నుంచి ఏఎల్‌పీ మైన్ వరకు, ఓసీపీ-1 సీహెచ్‌పీ వరకు పాడైన స్ట్రీట్ లైట్‌లను ఏర్పాటు చేయాలని కోరారు.

సంస్థ అభివృద్ధిలో కార్మిక సంఘాల పాత్ర కీలకం

- సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రు - ఏఐటీయూసీతో స్ట్రక్చర్ సమావేశం - పలు సమస్యలపై సుదీర్ఘ చర్చ

గోదావరిఖని, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ అభివృద్ధిలో కార్మిక సంఘాల పాత్ర చాలా కీలకమని డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రు అన్నారు. కార్మికుల పలు సమస్యలపై డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రు అధ్యక్షతన కొత్తగూడెం ఇల్లెందు క్లబ్‌లో గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వీ సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ కే రాజ్‌కుమార్, అన్ని ఏరియాల నాయకులతో 51వ నిర్మాణాత్మక సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ స మావేశంలో డైరెక్టర్(పా)మాట్లాడుతూ సంస్థ అభివృ ద్ధిలో, ఉత్పత్తి, ఉత్పాదకతలో కార్మిక సంఘాల పాత్ర చాలా కీలకమన్నారు. సింగరేణి ఉత్పత్తి, ఉత్పాదకత లోనే కాకుండా ఉద్యోగుల సంక్షేమానికి కూడా ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లపై సుదీర్ఘంగా చర్చించారు. యాక్టింగ్ క్లర్క్‌ల ను క్రమబద్ధీకరణ చేయాలని, సెక్యూరిటీ గార్డుల ఖాళీ లను అంతర్గత అభ్యర్థులతో భర్తీ చేయాలని, పెండిం గ్‌లో ఉన్న ఎన్‌ఓసీలను వెంటనే క్లియర్ చేయాలని కోరారు. ఉద్యోగులు తక్కువ గ్రేడ్ నుంచి ఉన్నత స్థాయి గ్రేడ్‌కు మారినప్పుడు వారికి ప్రమోషన్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. రాష్ట్ర లేబర్ ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్న డ్రిల్ ఆపరేటర్ల కేడర్ స్కీమ్ కేసును పరిష్కరిం చాలని, బొగ్గు ఉత్పత్తిని సింగరేణి ఉద్యోగులు మాత్రమే



గౌతమ్ పొట్రుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నిర్వహించాలని, కారుణ్య నియామకాల్లో విద్యార్హతల ప్రకారం తగిన ఉద్యోగం కల్పించాలని, డిగ్రీ అర్హతలో ఎటువంటి వ్యత్యాసం లేకుండా చేర్చాలన్నారు. కుమా రులు, కుమార్తెలతో సమానంగా, అల్లుడికి కూడా కారుణ్య నియమాకాన్ని సంవత్సరంలోపు దరఖాస్తు చేసుకొని పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరిం చాల ని కోరారు. సమస్యపై త్వరలో సానుకూల నిర్ణయం తీసుకుంటామని డైరెక్టర్(పా) తెలిపారు.

విధులకు గైర్హాజరు అయ్యే ఉద్యోగులకు వారి కు టుంబసభ్యులతో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించాలని తద్వారా ఉద్యోగి రోజువారీగా విధులకు హాజరయ్యేలా చూడటంలో, భూగర్భ గనులలో ఉద్యోగుల మాస్టర్ల శాతం పెరిగే లా, రక్షణ సూత్రాలు పాటిస్తూ, బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గించి విని యోగదారులకు నాణ్యమైన బొగ్గు సరఫరా చేయటంలో సం స్థకు సహాయ సహకారాలను అందించాలని డైరెక్టర్ (పా) గు ర్తింపు సంఘం నాయకులను కోరారు. సమావేశంలో యజమా న్యం తరపున జీఎం(పర్సనల్) ఐఆర్‌పీఎం కవితా నాయుడు, జీఎం(సీపీపీ) ఏ మనోహర్, జీఎం(ఫైనాన్స్) ఎం సుబ్బారావు, జీఎం(యూజీ మైన్స్) వై. రఘురామిరెడ్డి, జీఎం(పర్సనల్) వెల్ఫేర్ సీఎస్ఆర్ జీవీ కిరణ్ కుమార్, హెచ్‌ఓడీ(ఎంఎస్) బీ రవి, హెచ్‌ఓడీ(సివిల్) డీ వెంక టేశ్వర్లు, డీజీఎం(హెచ్ఆర్‌డీ) రఘుకుమార్, ఏజీఎం (పర్సనల్) జి రాజేంద్రప్రసాద్, ఏజీఎం (ఎంఎస్) వెంకయ్య, గుర్తింపు సంఘం తరఫున అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, కేంద్ర ఉపాధ్యక్షులు వంగ వెంకట్, ఎండీ అక్బర్ అలీ, ఉప ప్రధానకార్యదర్శులు కే సారయ్య, వైవీ రావు, కందికట్ల వీరభద్రం, ముష్కె స మ్మయ్య, బ్రాంచ్ సెక్రటరీ వై రాంగోపాల్ పాల్గొన్నారు.

69 మంది అధికారులకు క్వార్టర్ల కేటాయింపు

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సెక్టార్-3 కాలనీ లో ఉద్యోగులకు క్వార్టర్లను కేటా యించే నిమిత్తం శుక్రవారం ఆర్జీ-2 యాజమాన్యం సీఈఆర్ క్లబ్‌లో క్వార్టర్‌ల కౌన్సెలింగ్‌ను ని ర్వహించింది. ఆర్జీ-2 ఏరియాతో పాటు జీడీకే 11ఇంక్లయిన్, ఓసీపీ-1 ప్రాజెక్టులో విధులు నిర్వ హిస్తున్న ఉద్యోగుల్లో క్వార్టర్లు లేని వారికి, చేంజ్ ఆఫ్ క్వార్టర్స్ కోసం కౌన్సెలింగ్ జరిగింది. 540 క్వార్టర్లకు గాను 200 మంది దరఖాస్తు చేసుకోగా 105 మంది ఉద్యోగులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. వారిలో 69 మందికి అధికారులు క్వార్టర్‌లను కేటాయించారు.

సింగరేణి లో ఎక్కడా లేని విధంగా కంప్యూటరైజ్డ్ ద్వారా ఉద్యోగులు ఎంపిక చేసుకున్న క్వార్టర్‌ను అక్కడికక్కడే అలాట్‌మెంట్ లెటర్లను అందజేశారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

కౌన్సెలింగ్‌లో ఎస్టోటూ జీఎం రాముడు, ఏఐటీ యూసీ ఆర్జీ-2 బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, అధికార ప్రతినిధి, డీజీఎం పర్సనల్ అరవింద్‌రావు, సివిల్ ఈఈ ప్రతాపగిరి రాజు, డీవైపీఎం వేణు గోపాల్, వెల్ఫేర్ ఆఫీసర్లు అజీజ్, నరేష్, ఎస్ఎస్‌వో షరీఫ్ మహమ్మద్, క్వార్టర్ సెక్షన్ ఇన్‌చార్జి మమత తదితరులు పాల్గొన్నారు.

మహిళా రెస్క్యూ శిక్షణ పరిశీలన

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సింగరేణి రెస్క్యూ ప్రధాన స్టేషన్‌లో మహిళా ఉద్యోగుల రెస్క్యూ శిక్షణను శుక్రవారం డైరెక్టర్(ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) కే వెంకటేశ్వర్లు పరిశీలించారు. సింగరేణి చరిత్రలో మొదటిసారి మహిళా ఉద్యోగినిలకు రెస్క్యూ శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. శిక్షణ పొందిన మహిళతో బృందాన్ని ఏర్పాటు చేసి నవంబరులో జరగనున్న ఆల్ ఇండియా రెస్క్యూ పోటీలకు పంపనున్నట్టు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆల్ ఇండియా పోటీలకు అనగుణంగా శిక్షణ ఇస్తున్నట్టు, అత్యవసన పరిస్థితులను సమర్ధవంతంగా ఎదుర్కొగలిగే నైపుణ్యం పెంచుకోవాలని శిక్షణ పొందుతున్న వారికి సూచించారు. శిక్షణ ఏర్పాట్లు, విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శిక్షణ పొందుతున్న మహిళా ఉద్యోగినిలతో ఆయన మాట్లాడారు. డైరెక్టర్ వెంట ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య, ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్, రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డి, రెస్క్యూ సూపరెండెంట్ రాజేందర్‌రెడ్డి, ఎస్ఎస్ఓ షరీఫ్ మహమ్మద్, రెస్క్యూ ఇన్‌స్పెక్టర్ తిరుపతి, ట్రైనర్లు కిషన్‌రావు ఉన్నారు.



వకీల్‌పల్లె గనిని తనిఖీ చేసిన డీఎంఎస్



గనిలోకి దిగుతున్న డీఎంఎస్, అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): వకీల్‌పల్లె గనిని డైరెక్టర్ ఆఫ్ మైన్ సేఫ్టీ (ఎలక్ట్రికల్) రాజ్‌కుమార్ డీడీఎంఎస్(ఎలక్ట్రికల్)తో కలసి శుక్రవారం తనిఖీ చేశారు. ప్రాజెక్టు అధికారి ఆఫీస్‌లో సర్వే మ్యాప్ ద్వారా గనిలో పని స్థలాలను పరిశీలించారు. గనిలోకి దిగి 4వ సీమ్ ఎస్ఎస్ 4 డిస్ట్రిక్‌ను తనిఖీ చేశారు. రక్షణ పరమైన చర్యలు సమర్థవంతంగా చేయాలని గని అధికారులకు సూచించారు. వారి వెంట ప్రాజెక్టు అధికారి నెహ్రూ, ఏరి యా ఇంజనీర్ సృజన్ మెహ్రా, వర్క్‌షాప్ డీజీఎం రాంరెడ్డి, గని మేనేజర్ రవికిరణ్, గ్రూప్ ఇంజనీర్ ఫణికుమార్, సేఫ్టీ ఆఫీసర్ రాంకుమార్, సర్వే ఆఫీసర్ రహమత్‌అలీ ఉన్నారు.

మంద కృష్ణను కలిసిన ఎస్సీ అసోసియేషన్ బృందం



మంద కృష్ణను సన్మానిస్తున్న ఎస్సీ అసోసియేషన్ బృందం సభ్యులు

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకు డు మంద కృష్ణమాదిగను శుక్రవారం సింగరేణి ఎస్సీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ బృందం హైదరాబాద్‌లో కలిసింది. పద్మశ్రీ పురస్కారం అందు కున్న సందర్భాన్ని పురస్కరించుకుని అసోసియేషన్ ఆధ్వర్యంలో జూలై 13న గోదావరిఖనిలో చేయనున్న ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి రావాల్సిందిగా అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను ఆహ్వానించారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా దళితులకు సమన్యాయం జరుగుతుందని 30 ఏళ్ళుగా నిర్విరామంగా చేసిన పోరాటాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని అందజేసిందని అసోసియేషన్ కన్వీనర్ సొప్పదండి దుర్గాప్రసాద్ తెలిపారు. గోదావరిఖనిలో మంద కృష్ణను ఘనంగా సన్మానించనున్నట్టు దుర్గాప్రసాద్ తెలిపారు. నాయ కులు బొంకూరి మధు, మంథెన మల్లేష్, అడ్డాపురం చంద్రమౌళి ఉన్నారు.

ఆక్రమణలు తొలగేదెన్నడో?

(5వ పేజీ తరువాయి)

అక్రమంగా నిర్మించిన చేపల చెరువులను పరిశీలించారు. అనుమతులు లేకుండా చేపల చెరువులను నిర్మించారని, 70 ఎకరాల ప్రాజెక్టు భూములను కబ్జా చేసినట్లుగా సర్వే ద్వారా గుర్తించామని, విద్యుత్ చౌర్యానికి గుర్తైనట్లు గుర్తించామని అదనపు కలెక్టర్ వేణు ప్రకటించారు. ఆక్రమణలను తొలగించి భూములను స్వాధీనం చేసుకోవాలని నీటిపారుదల శాఖాధికారులను ఆదేశించారు. అలాగే ప్రాజెక్టు నుంచి నీటిని లిఫ్ట్ చేస్తున్న మోటార్లను నిలిపివేయాలని ఎన్‌పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసిన చేపల చెరువులు నిర్మించిన వారిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు సంబంధిత అధికారులు కబ్జాకు గురైన ప్రాజెక్టు భూముల్లో అక్రమంగా నిర్మించిన చేపల చెరువులను తొలగించకుండా చోద్యం చూస్తున్నారు. సాక్షా త్తు కలెక్టర్, అదనపు కలెక్టర్లు కబ్జాలను తొలగించాలని ఆదేశించినా కూడా ఇరవై రోజులైనా వాటిని స్వాధీనం చేసుకోకపోవడంతో అక్రమార్కులు యధేచ్ఛగా చేపలను పట్టి బహిరంగ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఆక్రమణలను తరలించి ప్రాజెక్టు భూములను పరిరక్షించాలని అంతర్గాం, రామగుండం ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

చంద్రబాబును విమర్శించే స్థాయి కవితకు లేదు


పెద్దపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఒక పరిపాలనాదక్షుడిగా పేరు గాంచిన ఆంధ్రప్ర దేశ్ ముఖ్యమం త్రి నారా చంద్రబాబు నా యుడిని విమర్శించే స్థాయి ఎమ్మెల్సీ కవితకు లేదని టీడీపీ పెద్దపెల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు అక్క పాక తిరుపతి విమర్శించారు. శుక్రవారం ఆయన పెద్దపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లిక్కర్ దందాలో దేశ వ్యాప్తంగా తెలంగాణ పరువు తీసి తీహార్ జైలులో నెలల తరబడి గడిపిన కవిత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై విమర్శలకు దిగడం అవివేకమని అన్నారు. సముద్రంలోకి వృథాగా పోతున్న గోదావరి వరద నీటిని పట్టుకుని, రాయలసీమ, పల్నాడు ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ తాజా ప్రభుత్వ నిర్ణయం ద్వారా పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టును చేపడుతున్నారన్నారు.



మాట్లాడుతున్న అక్కపాక తిరుపతి

రెండు రాష్ట్రాల మధ్య రాజకీయంగా జరుగుతున్న విమర్శ, ప్రతి విమర్శలు ప్రజలకు సముచితంగా తెలిసే ఆస్కారం ఉండాలన్నారు. ఈ వ్యవహారంలో చంద్రబాబు నాయుడుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ బిర్యానీ తినిపించి దీనిపై అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయడం లేదన్న కవిత విమర్శలు సరికావన్నారు. బనకచర్లపై రాజకీయంగా లబ్ధి పొందేందుకు కవిత మాట్లాడు తున్న తీరు హాస్యాస్పదమని తిరుపతి అన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు కొప్పుల మురళి, ప్రధాన కార్యదర్శి పెర్క శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు మాదిగల ఆత్మీయ సమ్మేళనం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దపల్లిటౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మాదిగ అఫిషియల్, అండ్ ప్రొఫె షనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో అన్ని మా దిగ సంఘాలను కలుపుకుని తెలంగాణ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఏడుగురు మాదిగ ఎమ్మెల్యేలకు ఈనెల 29న కరీంనగర్ ఏఎంఆర్ ఉన్నతి కన్వెన్షన్ అల్గునూర్‌లో ఘనంగా సన్మానం చేయనున్నట్లు మాదిగ సంఘాల నాయకులు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మాదిగలు పార్టీలకతీ తంగా పెద్దఎత్తున సన్మాన మహోత్సవానికి తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో మాదిగ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ఆసంపల్లి నాగరాజు, ఆలిండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర బాధ్యులు మామిడిపల్లి బాపయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, ఈర్ల సురేందర్, మహనీయుల ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు బొంకూరు కైలాసం తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల పై కేజ్ వీల్స్ వెళితే జరిమానా

- తహసీల్దార్ ధీరజ్ కుమార్



మాట్లాడుతున్న తహసీల్దార్ ధీరజ్ కుమార్

ఓదెల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించుకున్న బీటీ రోడ్లపై నుంచి కేజ్ వీల్స్ ట్రాక్టర్లు వెళితే సీజ్ చేయడమే కాకుండా, జరిమానా విధిస్తామని తహసీల్దార్ ధీరజ్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ట్రాక్టర్ యజమానులు, వ్యవసాయ అధికారులు, గ్రామపంచాయతీ కార్యద ర్శులతో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ధీరజ్ కుమార్ మాట్లాడుతూ, రోడ్లపై నుంచి వెళ్లే కేజ్ వీల్స్ ట్రాక్టర్ యజమానులకు మొదటిసారి దొరికితే రూ. 5000, రెండోసారి రూ.10 వేల జరిమానా విధిస్తామని, మూడవసారి దొరికితే రూ.20 వేల జరిమానాతో పాటు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్లో అప్పగిస్తామని తెలిపారు. దీనికోసం ప్రత్యేక నిమా విభాగాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుమ తులు లేకుండా ఇసుక, మట్టిని వాహనాల్లో తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి ఉన్న ఇసుకను తీసుకెళ్లడానికి భారీ వాహనాలను ఉపయోగించవద్దని కూలీలతో పనులు చేయించుకో వాలన్నారు. ఒకవేళ అనుమతి లేకుండా ఇసుక, మట్టిని తీసుకెళితే ట్రాక్టర్లకు రూ. 25వేలు, ఎక్స్‌కావేటర్లకు రూ. 50 వేలు జరిమాన విధిస్తామని తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకే ఇసుకను తీసుకెళ్లడానికి అనుమతి ఉందన్నారు. కార్యక్రమంలో ఏవో భాస్కర్, ఏఎస్ఐ వీరస్వామి పాల్గొన్నారు.

ఎలిగేడు: రహదారులపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు నడిపితే కఠినచర్యలు తప్పవని తహసీల్దార్ యాకన్న, ఎస్సై సత్యనారాయణ హెచ్చరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ట్రాక్టర్స్ ఎక్స్‌కావేటర్ యజమానులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎవరుకూడా కేజ్ వీల్స్‌తో నడపవద్దన్నారు. వాటితో రోడ్లు శాశ్వతంగా పాడవుతున్నాయని, గుంతలు అధికంగా ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో భాస్కర్‌రావు, ఆర్ఐ చంద్రశేఖర్, హెచ్‌సీ శ్రవణ్‌కుమార్, 12 గ్రామాల ట్రాక్టర్స్ యజమానులు పాల్గొన్నారు.

రామగుండంలో విధ్వంస పాలన

మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రామగుండం నియోజకవర్గంలో ప్రజా పాలన అంటూ విధ్వంస పాలన చేస్తున్నా రని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావ రిఖని చౌరస్తా సమీపంలో రోడ్డు వెడల్పు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో షాపులను కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయంగా కల్పించిన స్థలంలో వేసుకున్న షెడ్లను మున్సిపల్ అధికారులు కూల్చివేయడంతో శుక్రవారం కోరుకంటి చందర్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి మున్సిపల్ అధికారులు కూల్చిన షెడ్లను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకు న్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని చిరు వ్యాపారులంతా తమ దుకాణాలు మున్సిపల్ అధికారులు ఎప్పుడు కుల్చుతారో అన్న భయంతో బతుకుతున్నారన్నారు. చిరు వ్యాపారులను షెడ్లను కూల్చిన విషయంలో ఎవరు న్యాయం చేస్తారని ప్రశ్నించారు. అనంతరం బాధితులతో కలిసి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల మూలంగా, కార్పొరేషన్ అధికారుల సమన్వయ లోపం కారణంగా నష్టపోయిన చిరు వ్యాపారులకు నష్ట పరి హారం ఇచ్చి, వారికి ప్రత్యామ్నాయంగా వ్యాపారాలు చేసుకోవడానికి స్థలం చూపించాలన్నారు. కార్యక్రమం లో బీఆర్ఎస్ నాయకులు గోపు ఐలయ్యయాదవ్, నారాయణదాసు మారుతి, జేవీ రాజు, కల్వచర్ల కృష్ణవే ణి, ఐత శివ కుమార్, బొడ్డుపల్లి శ్రీనివాస్, అచ్చె వేణు, తోట వేణు, బొబ్బిలి సతీష్, దొమ్మేటి వాసు, సట్టు శ్రీనివాస్, బుర్ర వెంకన్న, కోడి రామకృష్ణ, కుమార్ నా యక్, ఆవునూరి వెంకటేష్, కిరణ్ జీ, తిమోతి, ఆడెపు శ్రీనివాస్, చింటూ పాల్గొన్నారు.



డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కోరుకంటి చందర్

'స్థానిక' ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జుల రామకృష్ణారెడ్డి

పెద్దపల్లి టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణా రెడ్డి సూచించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఆయన స్వగృహంలో శుక్రవారం పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో స్థానిక ఎన్నికలపై దిశనిర్దేశం చేశారు. అనంతరం మీడి యాతో మాట్లాడుతూ గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోతే కేంద్రం నిధులు ఆగిపోతాయని తెలిసినా ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. హైకోర్టు ఆదేశాల మేరకు మూడు నెలల్లో స్థానిక సం స్థలు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుందని హడావుడిగా రైతు భరోసా పేరుతో ఓట్లు దండుకునేందుకు కాంగ్రెస్ నేత లు నానా తంటాలు పడుతున్నారన్నా రు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యిందన్నారు.రైతులు, మహిళలు, యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీల ను ఎప్పుడు అమలు చేస్తారో ప్రజలకు తెలియజేయాలన్నారు. గ్రామ పంచా యతీలు, మున్సిపల్ ఎన్నికల్లో సైతం బీజేపీదే గెలుపన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం వేల కోట్ల నిధులు కేటాయించారని వివరించారు. కేంద్రం నిధులతోనే ప్రస్తుతం గ్రామపంచాయతీలు నడుస్తున్నా యని తెలిపారు. గత ప్రభుత్వం పెండింగ్‌పెట్టిన స ర్పంచుల బకాయిలను నేటి కాంగ్రెస్ సర్కార్ ఎందు కు చెల్లించడం లేదని నిలదీశారు. పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు సైనికులవలె కష్టపడి పనిచే యాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షు డు కర్రె సంజీవరెడ్డి, నాయకులు పల్లె సదానందం, వె ల్లంపల్లి శ్రీనివాసరావు, శిలువేరు ఓదెలు, పర్ష సమ్మ య్య, జంగా చక్రధర్‌రెడ్డి, శాతరాజు నరేష్, నిర్మల, తూడి రవి, రఘుపతిరావు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ముందస్తు అరెస్ట్

ధర్మారం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) పంచాయతీ కార్మికులు చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా మండలంలోని పంచాయితీ కార్మికులను ధర్మారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. మూడు నెలల పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలనే డిమాండ్‌తో పాటు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో మండలంలోని పలు పంచాయతీల్లో పనిచేసే కార్మికు లను శుక్రవారం పోలీసులు ముందుస్తు అరెస్ట్ చేశారు. కార్మికుల సమస్యలు తీర్చాల్సిన ప్రభుత్వం ఇలా అరెస్ట్ చేయడం సమంజసం కాదని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పంచాయితీ కార్మికుల డిమాండ్లను వెంటనే నెరవే ర్చాలని కార్మికులు అన్నారు. అరెస్ట్ అయిన వారిలో మండల అధ్యక్షుడు ఆకుల రాజయ్య, కూనమల్ల అశోక్, ఎదుల్ల రవికుమార్, ఉత్తెం రాజు, సాతారాజుల గంగాధర్ తదితరులు ఉన్నారు.



ధర్మారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో పంచాయతీ కార్మికులు, నాయకులు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ పోలీసులు గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. గర్రెపల్లిలో ఉంటున్న గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఆర్గనైజర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు జొన్నకోటి వెంకటే ష్, మండల అధ్యక్షుడు ఆసరి రమేష్, అమ్ముల సంపత్, గుడుగుల విద్యాసా గర్, సిరిసిల్ల వికాస్‌లను అదుపులోకి తీసుకుని సుల్తా నాబాద్ పోలీస్‌స్టేష న్‌కు తరలించారు.

పాలకుర్తి: మండలం పరిధిలోని గ్రామ పం చాయతీ సిబ్బందిని బసంత్ నగర్ పోలీసులు శుక్రవారం ముందస్తు అరెస్టు చేశారు.

జూలపల్లి: మండలంలోని ఆయా గ్రామాలకు చెంది న గ్రామ పంచాయతి కార్మికులను జూలపల్లి పోలీసులు ముందస్తుగా అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో అమరగాని పురు షోత్తం, వడ్లకొండ తిరుపతి,ఎండి అక్బర్, మధు, రమేష్, పలువురు కార్మికులు ఉన్నారు.

'భూముల్లోకి రానివ్వకుండా బెదిరింపులు'

మంథని, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తమ వ్యవసాయ భూముల్లోకి రానీయకుండా బెది రింపులకు పాల్పడుతున్నారని మండలంలోని గుంజపడుగు గ్రామానికి చెందిన బోగే రాజనర్సు ఆరోపించారు. శుక్రవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. తన తండ్రి గట్టయ్య 1981లో సర్వే నంబర్ 385లో ఉన్న దేవళ్ల మల్లయ్య వద్ద ఎకరం, దేవళ్ల పెద్ద అంకుస్ నుంచి రెండు ఎకరాల భూమి కొనుగోలు చేసినట్లు తెలిపారు. 1989లో సాదాబైనామా ద్వారా తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నా తన తండ్రి పేరిట పట్టా కాలేదన్నారు. నాటి నుంచి తామే ఈ భూములను సాగు చేసుకుంటున్నామన్నారు. తమ గ్రామానికి చెందిన దేవళ్ల శ్రీనివాస్ కుమారుడైన వెంకటేష్ ఈభూమి తమదే అంటూ ఈనెల 26న తమ భూముల్లోకి వచ్చి గొడవ దిగారన్నారు. ప్రశ్నించిన తమను దూషించి గొడలితో చంపుతానని బెదిరింపులకు పాల్పడినట్టు తెలిపారు. తమ ఫిర్యాదు మేరకు అతని పై మంథని పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దీన్ని అధికారులు సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

బియ్యం వితరణ

ఎలిగేడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని శివపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన తండ్ర భూమయ్య ఇటీవల క్యాన్సర్‌తో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి ఆల్‌ఇండియా అంబేద్కర్ సం ఘం జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ సంక నపల్లి లక్ష్మణ్, శివపల్లికి చెందిన పాలెపు పూర్ణ సుదాకర్‌రావు 50కిలోల బియ్యాన్ని అందజేశారు.

ఇంజనీరింగ్ కళాశాలల 48 గంటల బంద్

పెద్దపల్లి కల్చరల్, జూన్ 27 (ఆంధ్రజ్యో తి): ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ విద్యాసంస్థల 48 గంటల బంద్‌ను విజయ వంతం చేయాలని పీడీఎస్‌యూ పెద్దపల్లి అధ్యక్షుడు నరేష్‌రత్న పిలుపునిచ్చారు. శుక్ర వారం జిల్లా కేంద్రంలో పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్‌రత్న మాట్లాడుతూ విద్యారంగంపై ప్రభుత్వం వివక్ష కారణంగా రాష్ట్రంలో సుమారు 8వేల కోట్ల రూపాయలు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కొన్ని నెలలుగా విద్యార్థి సంఘాలు, విద్యార్థులు విజ్ఞప్తులు చేసినా ప్రభుత్వం బకాయిలు విడుదల చేయ కుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. దీనికి నిరసనగా జూలై 3, 4 తేదీల్లో 48 గంటల బంద్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నాయకులు శి, నరేష్, రమేష్, శివచరణ్, సాయిశరణ్, శ్రీకాంత్, రాజు, మహేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మృతి

ముత్తారం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపేట మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు బండి శ్రీదేవి భర్త రమేష్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుప త్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం సీతంపేటలో రమేష్ పా ర్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించా రు. మాజీ సర్పంచ్ పులిపాక నగేష్ ఉన్నారు.